క్లుప్తంగా

రాఖీ పండుగ శుభాకాంక్షలు


ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రక్షాబంధన్ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని, ప్రేమను నింపాలని ఆకాంక్షించారు.

కొండపి వైద్యశాలలో తొలిసారి సిజేరియన్


ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ కె.నాగమణి బృందం

కొండపి: కొండపి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తొలిసారి మహిళకు గురువారం సిజేరియన్ డెలివరీ చేశారు. మండలంలోని గుర్రప్పడియ గ్రామానికి చెందిన సొంగ గౌతమి పురుటి నొప్పులతో వైద్యశాలలో చేరింది. సాధారణ కాన్పు కష్టం కావడంతో వైద్యశాల సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ కే నాగమణి వైద్యశాలలో మొదటిసారి సిజేరియన్ ఆపరేషన్ చేశారు. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. వైద్య బృందాన్ని మంత్రి స్వామి అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

హనుమంతునిపాడు: మండల పరిధి నందనవనంలో శుక్రవారం సైబర్ నేరాలపై ఎస్సై ఎం.మాధవరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ద్విచక్ర వాణాలు డ్రైవ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

రేపు గంగాభవాని అమ్మవారి తిరునాళ్ల


తిరునాళ్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పామూరు: మండలంలోని వగ్గంపల్లి గంగాభవాని ఆలయంలో గంగాభవాని 16వ వార్షిక తిరునాళ్ల, అమ్మవారి శ్రావణ మాసపు పసుపు కుంకుమ ఉత్సవం ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు జాజుల మాల్యాద్రి, మల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా గంగాభవాని ఆలయంలో తిరునాళ్ల వాల్ పోస్టర్‌ను భక్తులతో కలిసి ఆవిష్కరించారు. తిరునాళ్ల సందర్భంగా కుంకుమపూజ, పొంగళ్లు, గంగాభవాని ఉత్సవమూర్తికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా గంగాభవాని ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి మూల విగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

సింగరాయకొండ: మండల కేంద్రంలో గురువారం స్కార్పియో వాహనాన్ని మోటారుసైకిల్ ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంజి వెంకటరత్నమ్మ(58) శుక్రవారం తెల్లవారుజామున మరణించింది. ఆమె స్వగ్రామం కొండపి మండలం కే ఉప్పలపాడు. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై బీ మహేంద్ర తెలిపారు.

జూదరుల అరెస్టు

గుడ్లూరు: జూదం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వి వెంకట్రావు వివరాల మేరకు.. మండలంలోని చేవూరు గ్రామంలో పేకాల ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.84 వేలు, మూడు ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

రాఖీ కొనుగోళ్ల సందడి

ఉలవపాడు: రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రాఖీల కొనుగోళ్ల సందడి కనిపించింది. శుక్రవారం ఉదయం నుంచే మండల కేంద్రమైన ఉలవపాడు, కరేడు గ్రామాల్లో రాఖీల అమ్మకాలు ప్రారంభించారు. ఉలవపాడులోని మెయిన్‌రోడ్‌లో షామియానాలు వేసి రాఖీ అమ్మకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు, విద్యార్థులు, చిన్నారులు రాఖీలను కొనుగోలు చేశారు. 9న శనివారం రాఖీ పండుగ కావడంతో ముందస్తు గానే రాఖీలను కొనుగోలు చేశారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల ప్రేమకు గుర్తుగా రాఖీలను కట్టే సంప్రదాయం ఉండడంతో మహిళలు భారీగా రాఖీలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది రాఖీల రేట్లు మాత్రం అధికంగా ఉన్నాయని మహిళలు అంటున్నారు.

చినుకు పడితే చీకట్లే..


టంగుటూరు 132/33 కేవీ సబ్ స్టేషన్


జమ్ములపాలెంలో వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిన దృశ్యం

- చిన్నపాటి వర్షాలకే కరెంట్ కట్
- సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో సమస్య
- గాలులకు కుప్పకూలుతున్న స్తంభాలు
- చెట్లను తాకే తీగలతో సరఫరాకు అంతరాయం


తూర్పునాయుడుపాలెం వద్ద దెబ్బతిన్న ఇన్సులేటర్లు

టంగుటూరు:

వర్షం వస్తే చాలు కరెంట్ కట్... కనీసం విద్యుత్ అధికారులు ఫోనుకు కూడా అందుబాటులోకి రారు. గాలి వీచిందా విద్యుత్ స్తంభాలు కుప్పకూలుతున్నాయి. దీనికితోడు సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో విద్యుత్ సమస్య తలెత్తుతోంది. చిన్నపాటి గాలి వీచినా గంటల తరబడి సరఫరా ఆగిపోతోంది. చెట్లకు కరెంటు తీగలు తాకే చోట సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇక వీధిలైట్లు సరే కనీసం ఇళ్లలోనూ బల్బులు వెలగక ప్రజలు చిమ్మ చీకట్లో గడపాల్సి వస్తోంది. ప్రస్తుతం రాత్రిళ్లు ఉక్కపోత భరించలేక కునుకు పట్టక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. టంగుటూరు 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో జమ్ములపాలెం, రాయివారిపాలెం, వెలగపూడి, టంగుటూరు, కొణిజేడు, ఎం.నిడమానూరు, దేవీశ్రీ పుడ్స్ 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 13,500 గృహాలు, 1200 పారిశ్రామిక, 1800 వ్యవసాయ మీటర్ల కనెక్షన్లు ఉన్నాయి. వర్షాకాలం కావడంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఫీడర్లు ట్రిప్పవడం, పిడుగుల శబ్దానికి ఇన్సులేటర్లు దెబ్బతినడం వంటి సమస్యలతో విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు గంటలకొద్దీ చీకట్లోనే మగ్గాల్సి వస్తోంది.

సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో సమస్య:

విద్యుత్ సరఫరాతో అతి ముఖ్యమైన ఇన్సులేటర్లు టంగుటూరు సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో దెబ్బతిన్నాయి. సామర్థ్యం తగ్గిపోవడంతో చినుకుపడితే చాలు నిప్పు రవ్వలు రాజుకుంటున్నాయి. ఈ సమయాల్లో ఆ ప్రాంతాల్లో పిడుగులు పడినా, గాలి వీచినా, వర్షాలు కురిసినా దెబ్బతినే అవకాశం ఉంది. వీటిని గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తీగలు తాకే చెట్లను కత్తిరించి, సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, వర్షాకాలంలో జరిగే విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్ని అప్రమత్తం చేయాలి.

వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది



వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో రాత్రంతా చీకట్లోనే గడపాల్సిన పరిస్థితి వస్తోంది. పిల్లలు, పెద్దలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. చెట్ల కింద వైర్లు, ఇన్సులేటర్లు మార్చి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి.

– దావులూరి సునీల్, మల్లవరపుపాడు గ్రామం, టంగుటూరు మండలం.

సమస్య లేకుండా చూస్తాం

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తాం, అప్రకటిత కోతలు లేకుండా చూస్తాం, ఈదురు గాలులు వీచిన సమయంలో స్తంభాలు నేలకొరగడం, పిడుగులు పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్ల ఎక్కడైనా దెబ్బతింటే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ లైన్లన్నీ పరిశీలించి, లోపాలు సరిచేయిస్తాం, ప్రస్తుతం టంగుటూరు టోల్ ప్లాజా నుంచి సూరారెడ్డిపాలెం వరకు ఇన్సులేటర్లు మారుస్తున్నాం. ఇబ్బందుల్లేకుండా సరఫరా జరిగేలా కృషి చేస్తాం.

– తోటా శ్రీకాంత్, టంగుటూరు 132/33 కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ ఏడీ.

పంచాయతీ రికార్డులు తారుమారు


పసుకుదురులో ఆగస్టు 2న జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న దృశ్యం

- అనంతవరం పంచాయతీ నిధులు రూ.1,49,000 దుర్వినియోగం
- అక్రమాలను కప్పిపుచ్చుకునేలా చర్యలు

టంగుటూరు: అనంతవరం పంచాయతీలో అక్రమాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. నిధుల దుర్వినియోగంపై 'సాక్షి'లో ఈనెల 3వ తేదీ కథనం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి అక్రమాల బాగోతం ఎక్కడ బయటకు వస్తుందో అన్న భయంతో రికార్డులు తారుమారు చేసే ప్రయత్నంలో నిమగ్నమయ్యారని సమాచారం. పంచాయతీ నిధులపై కన్నేసిన కార్యదర్శి పసుపుకుదురు ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేసినట్లుగా దొంగ బిల్లులు పెట్టి జూలై 24 వ తేదీ పంచాయతీ నిధులు రూ.1,49,000 కాజేశారు. దీనిపై ఆధారాలతో సహా 'సాక్షి'లో కథనాలు రావడంతో ఆగస్టు 2వ తేదీ పంచాయతీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేసి, ఆమేరకు రికార్డులు తారుమారు చేశారు. ఆగస్టు 2వ తేదీన పనులు చేసి జూలై 24న నిధులు డ్రా చేయడంలో కార్యదర్శి ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శి అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పసుపుకుదురు గ్రామానికి చెందిన కసుకుర్తి సురేష్ ఫిర్యాదు చేశారు.


Ananthavaram
LGD Code :234891
చెల్లింపు ఆర్డర్
2025-2026
Jungle Clearance Work In Ananthavaram Thetupuram Thallapalem Pasukuduru Habitations Of Ananthavaram Gp Of Tangutur Mandal
₹ 1,49,927
KASUKURTHI VENKATESWARLU
***********5050
NA
XVFC/2025-26/P/6
[24/Jul/2025]
Vuribindi Madhu Malathi

జూలై 24 బిల్లు పెట్టిన దృశ్యం

హనుమంతునిపాడులో కుంభవృష్టి


సీతారాంపురం వద్ద పారుతున్న దోమలేరు


సీతారాంపురంకాలనీ వద్ద పడిపోయిన విద్యుత్ స్తంభం

- పొంగిన దోమలేరు
- గాలి, వానకు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

హనుమంతునిపాడు: మండలంలో గురువారం రాత్రి పొద్దు పోయిన తర్వాత ఉరుములు, మెరుపులు, గాలితో కుంభవృష్టి కురిసింది. వాన బీభత్సం మండల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. వీరరాంపురం, నందనవనం, ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, కూటాగుండ్ల, సీతారాంపురం, హనుమంతునిపాడు, ఉమ్మనపల్లి, హనుమంతాపురం తరదితర ప్రాంతాల్లో వర్షం జోరుగా కురిసింది. మండల కేంద్రంలో 96.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. వర్షానికి సీతారాంపురం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం కోతకు గురై పడిపోయింది. దోమలేరు పొంగి పొర్లింది. వంకలు, కుంటలు, చెక్ డ్యామ్‌లోకి నీరు వచ్చినట్లు ఆయా గ్రామాల్లోని ప్రజలు చెప్తున్నారు. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షమంటున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

- కిటకిటలాడిన ఆలయాలు
- విశిష్ట పూజలు చేసిన భక్తులు


టంగుటూరులో ప్రత్యేక అలంకరణలో అంగాళ పరమేశ్వరి అమ్మవారు


కనిగిరి: అమ్మవారికి ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: శ్రావణ శక్రవారం సందర్భంగా మహిళలు తమ సౌభాగ్యం కోసం ఆచరించే వరలక్ష్మీ వ్రతాలను పలు ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నియమ నిష్టలతో నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు ఆయాలయాల్లో వ్రతాలు నిర్వహించి వరలక్ష్మీ దేవికి ఆరాధన చేశారు. బ్రహ్మణులు, వేదపండితుల ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. పట్టణంలోని కోదండరామ స్వామి ఆలయంలో విశిష్ట పూజలు జరిగాయి. ఆలయ కమిటీ నాయకులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వీఈఆర్ మనోహర్ రావు (చిరంజీవి), ధనమ్మ, కళావతి, చెలికచర్ల సురేష్ ఆచార్యుల పర్యవేక్షణలు కార్యక్రమాలు జరిగాయి. స్థానిక దేవాంగ నగర్‌లోని కేటీఆర్ స్కూల్ ఆవరణలోని శ్రీలక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో శ్రావణ మాస వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, ట్రెజరీ ఉప్పాల నరసింహారావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, ఉప్పాల సుబ్బారావు పాల్గొన్నారు.

పామూరు: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వారి వారి నివాస గృహాలతో పాటు ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు ఉపవాసాలతో తమ నివాస గృహాల్లో ప్రత్యేక అలంకరణతో చేసిన మందిరాల్లో లక్ష్మీదేవి అమ్మవారిని ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, సహస్రనామార్చనలు, అష్టోత్తరాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే అష్ట ఐశ్వర్యాలు సమకూరుతాయని, ముత్తయిదువలుగా పసుపు కుంకుమలతో దంపతులు సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా స్థానిక వాసవీమాత, మహాలక్ష్మి దేవి, ఆలయాల్లో అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, జేవీఎస్ ప్రసాద్, రాఘవ సుమంత్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గాజులపల్లి ధనలక్ష్మి, కొల్లూరి రవికిరణ్‌శర్మ, పుట్లూరి యోగీశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లూరమ్మ ఆలయంలో, టంగుటూరు లోని అంగాళ పరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వల్లూరమ్మ ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పాతసింగరాయకొండలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింగరాయకొండ: మండలంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరశింహాచార్యులు మహిళల చేత వ్రతాలు చేయించి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.


వరాహలక్ష్మీ నరశింహస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు


సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు


కోదండరామ స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు


పూజల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

ఘనంగా పోలేరమ్మ ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: మండలంలోని కూచిపూడి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గూడలి వెంకట కృష్ణచైతన్యశర్మ ఉదయం పంచామృతాభిషేకం, అమ్మవారికి జలాధివాసం, వాస్తుపూజ, వాస్తు బలిపర్తి, యంత్రపూజ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ, అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, మాకినేని వెంకట్రావు, బొల్లినేని నాగేశ్వరరావు, వనిపెంట మల్లికార్జునరెడ్డి, ఇనుకొల్లు జగన్‌రెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, యూ బాల చెన్నారెడ్డి, మాచేపల్లి హనుమంతరావు, చెన్నపనాయుడు, సిద్దయ్య ఉన్నారు.


పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న దంపతులు

నీటి ప్రవాహాన్ని అడ్డగిస్తే చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: నీటి ప్రవాహాలను అడ్డగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ హెచ్చరించారు. స్థానిక పదో వార్డు పాతూరు బీసీ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నీటి ప్రవాహాలను అడ్డగిస్తే వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. వైవే నిర్మాణంతో పాతూరు బీసీ కాలనీ ప్రాంతం లోతట్టుగా మారిందన్నారు. భారీ వర్షాలు కురిస్తే ఆ ప్రాంతం ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ముందస్తు చర్యగా నీటి నిల్వలు లేకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కౌన్సిలర్ దాసరి పద్మ, కో ఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

సింగరాయకొండ: రోడ్డు దాటుతున్న వ్యక్తి బ్యాగును బస్సు తగలడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మణరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ మీద కనుమల్ల ఎక్స్ రోడ్డు వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన గుంతటి సింగయ్య (53) హైదరాబాద్ వెళ్లడానికి కనుమళ్ల వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో ఒంగోలు నుంచి కావలి వైపునకు కర్ణాటకు చెందిన కేఏ 57 ఎఫ్ 6393 నంబర్ గల ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న సింగయ్య భుజానికి ఉన్న బ్యాగుకు తగిలింది. బస్సు వేగానికి సింగయ్య గాల్లోకి లేచి రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మెలకు బలంగా ఢీకొట్టాడు. దీంతో సింగయ్య తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న జీవీ, కంకణాల

కనిగిరి రూరల్: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ ప్రకాశం జిల్లా 17వ మహాసభలు ఈ నెల 12, 13వ తేదీల్లో కనిగిరిలో జరుగుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు స్థానిక టీచర్స్ అకాడమీ నుంచి ప్రదర్శన, 4 గంటలకు క్లబ్‌రోడ్డులో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ప్రధాన వక్తగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని చెప్పారు. 13వ తేదీ టీచర్స్ అకాడమీలో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. వ్యవసాయ కార్మికులు, కర్షకులు అందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు పిల్లి తిప్పారెడ్డి, పీసీ కేశవులు, కె.మాల్యాద్రి, పి.నరేంద్ర, కె.వెంకటమ్మ పాల్గొన్నారు.